వింత ప్రవృత్తి

# అరణ్యారోదనము

రచన: యం. వి. బి. ఎస్. శర్మ

ఆమెను చూస్తూంటే డాల్డాడబ్బా - నూనె గానుగా-జ్ఞాపకం రావడం ఆమె దురదృష్ట మంటారా? నా దౌర్భాగ్యమంటారా? ఆమె వంకే చూస్తూ, ఎన్నిమార్లు చూపులు మరల్చ లేకపోయానో మీకేం తెలుసు?

నాకామెపై సదభిప్రాయంగానీ, అసహ్యాం గానీ ఏదీలేదు-అసలు ఆమెను నాజన్మలో ఏ రోజూ కోరలేదు. కానీ నా చూపులు ఆమె పైకే దాడి చేస్తున్నవెందుకు? ఇష్టంలేని వస్తువులపైకూడ దృష్టివుంచడం-ఇదే ప్రథమానుభూతి కాబోలు!

ఆమె లావుగావుంటే ఎవరికి కావాలి? నల్లగావుంటే. ఎవరికి కావాలి? పైగా ఆమె నాకు బంధువైనా కాదు-అంత పాపం చేయలేదు మరి-అరవలను అకారణంగా ద్వేషించే ఆంధ్ర జాతి సోది-నేను ఆమెవైపు చూస్తుంటేటపుడు మిత్రులు పట్టుకొనిన - ఇక నాకు మోక్షం లేదు - సంఘంలోనుంచి వెలివేస్తారేమోయని వాడలి ఛస్తున్నామ. అసలీ వాతావరణకే అలాంటి శక్తివుందేమో? మీసాలు లేనివాళ్లు మగవారేకారనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన నేను - మీసాలు తీసేద్దామా యని ఆలోచిస్తుంటే బుర్ర బద్దలు చేసుకుందామా అనేంత కోపం వస్తూంది మరి.

అటుపైని రూముకు రాకపోకలు క్రమంగా తగ్గిద్దామనుకొని-అదీ ప్రయత్నించాను. అబ్బే-నామాటవినే బుద్ధయితేగా? శాస్త్రజ్ఞులు దీన్ని ఏజాతికి చేరుస్తారో? కొంపదీసి నన్ను మమ్మే ఆయా జాతికి చేర్చరుకదా?

ఆమె అందంగా లేకపోయినా - ఆమెలో ఆకర్షణేమన్నా వుందేమోయని యోచించా.

లీలావతి గణితం-రాస్ ఆల్జీబ్రా-కుష్మాస్వామయ్యర్ మేడ్ డిఫికల్ట్ - కంఠగతం చేసిన నేను-ఈ పజిల్ ని సాల్వుచేయలేక పోతున్నానే?

రూము అధికారి-నా ప్రవర్తన బాగాలేదని ఫామిలీ సర్కిల్స్ లో పనికిరాననీ-గట్టిగా మందలిస్తున్నాడు. వంకలెంచలేని నాగుణం ఎల్లాంటి స్థితికి వచ్చింది!

నేను చదివే లిటరేచర్ దీనికి కారణమేమో అని చలంగారి పుస్తకాలు మిత్రులకు దానం చేసా. ధనికొండ, కుటుంబం. కేరా, ప్రనీల్ - వీరినందరిని నా మనోపీఠంనుంచి బానిష్ చేసి ఎన్నటికీ తలవనైనా తలవనని శనైశ్వరుడికి ప్రదక్షిణాలుకూడా చేశానే? నామనస్సెందుకిలా పరిపరి విధాల పోతూంది? ఒక్కమారే నాలో పరివర్తనం రాదుకదా? నా శీలంపు సర్టిఫికెట్లూ, వెంకమ్మగారు అమ్మతో నన్నుగూర్చి సెలవిచ్చిన అభినందనవాక్య పరంపరలూ నేను ధీరంగా నిరాకరించిన కమలా ప్రణయలేఖలు ఇవన్నీ నన్నుచూసి కన్నెత్తి చేస్తున్నవెందుకూ?

నాకు తెలియని బలీయమైన విపరీత శక్తులు నన్నిలా ముందుకు తోస్తుంటే వాటితో బాటే పురోగమించడం నాకేం బాగుంటంలేదు. కానీ ఏం చెయ్యను? నాకు తెలియకుండానే కాలు జారింధంటే ఎవరన్నా నమ్ముతారా?

నాకు సహాయం చేసే దేవుడెవ్వడూ లేడూ? అటువంటి చచ్చు పెద్దమ్మ ఎన్నడూ వుండడని చెప్పిన ఈ కవులందరూ ఇప్పుడూ తోక ముడుస్తున్నారేం?

ఇంతమంది మానవుల్లో నన్నేకాకిని చేసి ఆ అరవ వనిత దగ్గరికి అయస్కాంతశక్తితో ఝంఝామారుత వేగంతో అగ్నిపర్వత ప్రకోపనావేగంతో నెట్టుతూండే శక్తినుంచి కాపాడే నాధుఁడు లేడా?

ఉన్నారు ఈ విశాలప్రపంచంలో అనంతాకాశపు నీలినీడలు తాండవించే ఈ జగతిలో లేకపోతారా మరి? ఎవరో చెప్పనా ఆ మలయాళవనితే!